
సాక్షి బాపట్ల

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



నేడు సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించనున్నారు. సర్వమానవాళి శ్రేయస్సు కోసం ఈ కార్యక్రమం జరుగుతుంది.



చిన్న తిరునాళ్లకు పక్కాగా ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ చిన్న తిరునాళ్లకు చక్కగా ఏర్పాట్లుచేయాలని ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. మార్చి 7 నుంచి 11 వరకు జరిగే ఉత్సవాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు.



మహాదేవునికి సూర్యకిరణాభిషేకం

చినగంజాం: గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయంలో శనివారం మూలవిరాట్‌ను సూర్యకిరణాలు అభిషేకించాయి. భక్తులు ఈ దృశ్యాన్ని చూసి తరించారు.

న్యూస్‌రీల్

28న సీఎం జగన్ తెనాలి పర్యటన



తెనాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి పర్యటనలో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. ముందుగా నిర్ణయించినట్టుగా ఈ నెల 27వ తేదీ కాకుండా 28వ తేదీ సీఎం పర్యటన ఉంటుందని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ప్రకటించారు. ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి తెనాలికి చేరుకుంటారని, వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే సభలో రైతులకు నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయం, ఇటీవల పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ చేస్తారని వివరించారు. ఈ నేపథ్యంలో శనివారం మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న బహిరంగ సభా వేదిక, హెలిప్యాడ్ వద్ద జరిగే పనులను వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ సి.హరికిరణ్, జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి పరిశీలించారు. వీరితో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, తెనాలి డీఎస్పీ డాక్టర్ కె.స్రవంతిరాయ్ ఉన్నారు. అనంతరం తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీఎం పర్యటనపై జిల్లా కలెక్టర్ ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

7న దివ్య రథోత్సవం



మంగళగిరి: పానకాల లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమై మార్చి 7వ తేదీ వరకు జరుగనున్నాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు నేతృత్వంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి పెండ్లి కుమారుడి ఉత్సవంతో ప్రారంభం కానున్నాయి. 27వ తేదీ రాత్రి 8 గంటలకు ధ్వజారోహణం, 6వ తేదీ రాత్రి 12 గంటలకు స్వామివార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 7న ఉదయం 6 గంటలకు బంగారు గరుడోత్సవం, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దివ్య రథోత్సవం నిర్వహించనున్నారు.

మార్చి 8 నుంచి టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు

ఎఫ్‌ఏ–4కు బదులుగా ప్రీ–ఫైనల్ పరీక్ష




గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మార్చి 8 నుంచి 16వ తేదీ వరకు ప్రీ–ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ప్రీ–ఫైనల్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేలా పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ద్వారా పబ్లిక్ పరీక్షల మాదిరిగా ఆరు పేపర్ల విధానంలో రూపొందించిన ప్రశ్నపత్రాలతో ప్రీ–ఫైనల్ పరీక్షలు జరుగుతాయి. మార్చి నెలాఖరులో నిర్వహించాల్సిన ఎఫ్‌ఏ–4 పరీక్షలను రద్దు చేసి, వాటి స్థానంలో ప్రీ–ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ మేరకు హెచ్‌ఎంలు, ఉప విద్యాశాఖాధికారులు, డీఈవోలు తగు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు మార్గదర్శకాలు విడుదల చేశారు.

బీసీలంటే చిన్నచూపు కాబట్టే...

‘బీసీలు అంటే వెన్నెముక. వెనుకబడిన వర్గాల వారు కాదు’ అని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే చెబుతున్నారు. ఆ వర్గాలను అదే స్థాయిలో చూస్తున్నారు. పదవుల అంశంలో అంతే ప్రాధాన్యమిస్తున్నారు. బీసీలకు మంచి చేయడంలో వైఎస్సార్ సీపీ అధినేతకు యావత్ భారతదేశంలో మంచి గుర్తింపు వచ్చింది. ఆదరణ లభిస్తోంది.

‘మరి మన పార్టీలో ఏం జరిగింది. ఇప్పుడేం జరుగుతోంది. బీసీలు అన్నింటినీ బేరీజు వేసుకుంటున్నారు. మాటలతో మనం ఇంకెంత కాలం మభ్యపెట్టగలం’ అని టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద ఆ పార్టీకి చెందిన సీనియర్లు వాపోయారు. గన్నవరంలో చోటుచేసుకున్న తాజా పరిణామాల నేపథ్యంలో బీసీ వర్గాల ముఖ్యనేతల అంతర్గత చర్చల్లో వచ్చిన అంశాలు అధినేత చెవికి చేరాయి. దీనిపై తీవ్రంగా కలత చెందిన చంద్రబాబు తక్షణ నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు.

- అర్జునుడు ఆస్పత్రిలో ఉంటే ఎవరైనా అలా చేస్తారా?
- మీ దన్ను చూసుకునేగా అలా రెచ్చిపోతోంది
- క్యాడర్, క్యారక్టర్ ఏవీ పట్టించుకోరా?
- బూతులు మాట్లాడితేనే పదవులిచ్చేస్తారా?
- పార్టీ ఆఫీసులపై దాడులు ఎవరివల్ల జరిగాయో ఆలోచించండి
- బాబు వద్ద పట్టాభి తీరుపై టీడీపీ సీనియర్ల గుర్రు
- నష్ట నివారణకేనా గన్నవరం తక్షణ కమిటీ



మాటలు చెపితే సరిపోదు...

‘ఎమ్మెల్సీల్లో బీసీలకు జగన్ ఇచ్చిన ప్రాధాన్యతపై మా వెనుకబడిన వర్గాల్లో బాగా చర్చ జరుగుతోంది. అంతకుముందు కూడా వివిధ పదవుల్లో దక్కిన ప్రాధాన్యతను ఇప్పటికే గుర్తించారు. ఇక నుంచి మీకు మేమంత చేశాం.. ఇంత చేసేశాం.. అని టీడీపీ చెపితే వినే దశలో బీసీ వర్గాలు లేవు. అన్నీ విశ్లేషించుకుంటున్నాయి. గణాంకాలతో సహా ముఖ్యులకే పాఠాలు అప్పజెపుతాయి’ అని విజయవాడకు చెందిన బీసీ ముఖ్య నాయకుడు ఒకరు కుండబద్దలు కొట్టారు.

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ‘గన్నవరం నియోజకవర్గ ఇంచార్జి బచ్చుల అర్జునుడు తీవ్ర అస్వస్థతలో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా తగుదునమ్మా అంటూ నేను వస్తున్నా. నేనే పోటీచేస్తా అంటూ పట్టాభిరాం అక్కడకు ఎలా వెళతారు. అర్జునుడు బీసీ వర్గానికి చెందినందునే అంత ధీమాగా, బహిరంగంగా ఆయన చాలెంజ్ చేయగలిగారు. అదే పార్టీలో బలమైన సామాజికవర్గానికి చెందిన వారు అక్కడ ఇంచార్జిగా ఉన్నట్లయితే ఆ మాట అనగలిగే వారా? సామాజికవర్గం అండ చూసుకునే రెచ్చిపోయారు. మీ దన్ను అంతలా ఉండబట్టే పట్టాభి ఆ స్థాయిలో రెచ్చిపోతున్నారనేది పార్టీలో మెజార్టీ అభిప్రాయం’ అని టీడీపీ సీనియర్లు అనడంతో చంద్రబాబు కంగుతిన్నారనేది సమాచారం. ‘క్యాడర్, క్యారక్టర్ ఏవీ పట్టించుకోకుండా ఇష్టానుసారం బూతులు మాట్లాడిన వారికి పదవులు ఇచ్చేస్తారనేది ముఖ్య శ్రేణులు భావిస్తున్నాయి. మంగళగిరి, గన్నవరం పార్టీ ఆఫీసులపై దాడులు ఎవరివల్ల జరిగాయి? ఎందువల్ల జరిగాయో మీరే విశ్లేషించుకోండి’ అని పార్టీ నాయకులు అనడంతో బాబు ఆలోచనల్లో పడ్డారని తెలిసింది. అయినా కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తదితర బీసీ వర్గానికి చెందిన నాయకులు ఉన్నారు. గన్నవరంలో పార్టీకి ఏదైనా సమస్య ఉందని భావిస్తే అర్జునుడు తీవ్ర అస్వస్థతో ఉన్నందున కొనకళ్ల, కొల్లు, లేదా బచ్చుల కుమారుడు, మరెవరినైనా సీనియర్లను అక్కడకు పంపి ఉండవచ్చు. కానీ పట్టాభిని పంపి రెచ్చగొట్టించడాన్ని బట్టి బీసీలంటే మీకు చిన్న చూపు ఉందనే భావన ప్రజల్లోకి, పార్టీ క్యాడర్‌లోకి బాగా వెళ్లిపోయిందని వివరించడంతో బాబు కంగుతిన్నారని సీనియర్ నాయకుడు ‘సాక్షి’కి తెలిపారు. బీసీల గురించి చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన ఎంతమేరకు ఉందనేది బేరీజు వేసుకుంటున్నారని కూడా అన్నారనేది సమాచారం.

గన్నవర్గానికి కో- ఆర్డినేటర్ కమిటీ

చంద్రబాబు ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గానికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శుక్రవారం కమిటీని నియమించారు. కమిటీ కో–ఆర్డినేటర్‌గా కొనకళ్ల నారాయణ, సభ్యులుగా బచ్చుల అర్జునుడు కుమారుడు బచ్చుల సుబ్రహ్మణ్యంతోపాటు మరో నలుగురికి చోటు కల్పించారు.



సీఐ కనకారావుపై చేసిన దాడిని పోలీసువర్గాలు తీవ్రంగా భావిస్తున్నాయని. టీడీపీ అల్లరి మూకలు ఇంతలా బరితెగిస్తాయని అనుకోలేదని వారంటున్నారని చంద్రబాబు దృష్టికి పలువురు తీసుకెళ్లారు. సంఘటన జరిగినప్పుడు గాయం తీవ్రత బాగా తెలిసిందని, ఏడు కుట్లు పడ్డాయని వివరించారు.

విద్యాశాఖాధికారులపై ప్రిన్సిపల్ సెక్రటరీ ఆగ్రహం

- అనంతవరం పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్
- ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల వినియోగంలో అలసత్వంపై అసహనం
- ట్యాబ్‌ల వినియోగంలో వెనుకబాటుపై అధికారులు, ఉపాధ్యాయులకు హెచ్చరికలు



విద్యాశాఖాధికారులను ప్రశ్నిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

కొల్లూరు: నాడు–నేడు పథకంలో భాగంగా ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల వినియోగం విషయంలో విద్యాశాఖాధికారుల అలసత్వంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అనంతవరం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదులను పరిశీలించిన ఆయన విద్యార్థులను కలిసి మధ్యాహ్న భోజన నాణ్యత, పాఠశాలలో సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధనా తీరు ఆరా తీశారు. విద్యార్థులు యూనిఫాం, బెల్టు, షూ ధరించకపోవడాన్ని గుర్తించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థలో ప్రగతి కోసం రూ.కోట్లు వెచ్చించి ప్రతి విద్యార్థికి షూ, బెల్టు, బ్యాగ్, యూనిఫామ్ అందజేస్తుంటే వాటిని ఎవ్వరూ వినియోగించకపోవడానికి కారణమేమిటంటూ విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా వ్యవహరించాల్సిన విద్యాశాఖాధికారులు నిర్లక్ష్య ధోరణిలో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జేడీ, డీఈఓ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అధించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని పాఠశాలల్లో అమలు చేసే విషయంలో వైఫల్యంపై ఉపాధ్యాయులతో పాటు, విద్యాశాఖాధికారులను మందలించారు. విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన యూనిఫాం, షూ, బెల్టు, బ్యాగ్‌లు తప్పనిసరిగా వినియోగించేలా చూడటంతో పాటు, 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సుబ్బారావు, డీఈఓ రామారావు, ఇన్‌చార్జి ఎంఈఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పనితీరు మారకుంటే చర్యలు తప్పవు

వేమూరు: విద్యాశాఖ అధికారులు పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరించారు. వేమూరులోని బీసీ బాలికల హాస్టల్‌ను ప్రవీణ్‌ప్రకాష్ తనిఖీ చేశారు. పలు అంశాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఈఓ నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను తనిఖీ చేశారు. ఆ తర్వాత వేమూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు



జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంపై సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు

బాపట్ల: జగనన్న కాలనీల్లో మార్చి నెలాఖరు నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శనివారం బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్యాడ్సన్‌పేట జగనన్న లేఅవుట్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రారంభించని గృహాలను వెంటనే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాల లబ్ధిదారులకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయడానికి డాక్యుమెంటేషన్ పూర్తి చేయాలని చెప్పారు. గ్రూపుల్లో ఉన్న అర్హతగల లబ్ధిదారులకు డాక్యుమెంటేషన్ వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాల పురోగతిపై మెప్మా రిసోర్స్ పర్సన్స్ పనితీరు సక్రమంగా లేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహ నిర్మాణాలకు వలంటీర్లు సహకరించాలన్నారు. జగనన్న లేఅవుట్లలో అంతర్గత రహదారులు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రవికుమార్, తహసీల్దార్ కవిత పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య



భార్యాభర్తల మధ్య చిన్నపాటి విభేదాలు వచ్చాయి. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. ఇరు కుటుంబాల పెద్దలు సర్ది చెప్పడంతో కొద్దికాలంగా దంపతులు కలిసే కాపురం చేస్తున్నారు. పుట్టింటి వద్ద ఉన్న రెండేళ్ల కాలంలో ఓ యువకుడితో ఆమెకు వివాహేతర బంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో యువకుడు ఇంటికి వచ్చిపోతుండటం, భార్య తరచూ ఎక్కడికో వెళ్లి వస్తుండటంతో అనుమానం వచ్చిన భర్త ఆమెను పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించాడు. దీంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని భావించిన భార్య, ప్రియుడితో కలిసి హత్య చేయించింది.

అనుమానమే పెనుభూతమై..



ఉపాధి కోసం ముగ్గురు పిల్లలతో పట్టణానికి వచ్చారు ఆ దంపతులు. ఇద్దరూ రోజువారీ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అధిక సంతానానికి తోడు భర్త మద్యానికి బానిస కావడంతో ఖర్చులు పెరిగాయి. వీరుంటున్న ఇంటి పక్కనే భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న మహిళ వేరే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. వీరి ఇబ్బందుల్ని గుర్తించి ఆమె పలుమార్లు డబ్బుసాయం అందించింది. దీంతో ఎక్కువసార్లు భార్య ఆ ఇంటికి వెళ్లేది. ఇది గమనించిన భర్త తన భార్య కూడా తప్పు చేస్తోందనే అనుమానం పెంచుకున్నాడు. నిజం చెప్పాలంటూ భార్యను పలుమార్లు బెదిరించాడు. చివరకు మద్యంలో విషం కలుపుకుని తాగి చనిపోయాడు. ఫలితంగా భార్యాపిల్లలు రోడ్డున పడ్డారు.

వివాహేతర సంబంధంతో అలజడి



భార్యను దూరం పెట్టిన ఓ భర్త సహ ఉద్యోగినితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. రహస్యంగా ఆ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈ విషయం సహజీవనం చేస్తున్న యువతి ప్రియుడికి తెలిసింది. తాను ప్రేమించిన యువతి డబ్బు మోజులో తనను మోసం చేసిందని స్నేహితులకు చెప్పుకుని ఏడ్చాడు. మిత్రుడి బాధను చూసి అంతా కలిసి స్కెచ్ వేశారు. ఉద్యోగిని మందు పార్టీకని పిలిచి అందులో విషం ఇచ్చి చంపేశారు. పోస్టుమార్టంలో అసలు నిజం వెలుగుచూసి వారందరూ అరెస్ట్ అయ్యారు. ఇక్కడ మృతుడి భార్య ఒంటరిదై పోయింది. ప్రేమించిన యువతి మోసంతో యువకుడు కటకటాలపాలయ్యాడు.

ఇవి మానవ సంబంధాల్ని దెబ్బతీస్తున్న కొన్ని ఘటనలు. మన మధ్యే జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలకు వెనుక ఉన్న యథార్థ గాథలు..!

– గుంటూరు డెస్క్

అనుబంధాల ఆర్తనాదం

- వివాహేతర సంబంధాలతో హత్యలు
- అనుమానాలతో ఆత్మహత్యలు
- ఆకర్షణకు లోనై కోల్పోతున్న విచక్షణ
- ఛిద్రమవుతున్న వైవాహిక బంధాలు



సమాజంలో బంధాలు, అనుబంధాలకు ఎంతో విలువ ఉంది. కొన్ని సందర్భాల్లో అత్యాశ, అనుమానం, వ్యామోహం ఈ విలువలను దిగజార్చేలా చేస్తున్నాయి. ప్రేమ పెళ్లిళ్లు, కొన్నిచోట్ల పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు సైతం వివాహేతర సంబంధాల వల్ల విచ్ఛిన్నమవుతున్నాయి. హద్దులు దాటాక ఊహించని పరిణామాలు జరిగి వ్యక్తుల జీవితాలు, కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రస్తుతం కాలంలో హత్యలు, ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఇందుకు వివాహేతర సంబంధాలే కారణం కావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. అక్రమ సంబంధాలు, ఆస్తికోసం అడ్డు వస్తున్నారని భార్య లేదా భర్త ఒకరినొకరు చంపేందుకు కూడా వెనుకాడటం లేదు. ప్రపంచంలోనే ఆదర్శ కుటుంబ వ్యవస్థ కలిగిన దేశం మనది. నూరేళ్ల జీవితాన్ని సంతోషంగా గడపాలని ఆశించి చేసుకున్న పెళ్లినాటి ప్రమాణాలు పటాపంచలవుతున్నాయి. ఫలితంగా ప్రాణంగా ప్రేమించిన వారు.. జీవితాంతం తోడుండాల్సిన వారే తోడేళ్లవుతున్నారు.

బంధం బలపడాలంటే..

- దాంపత్యంలో దాపరికాలు ఉండకుండా చూసుకోవాలి.
- పొరపాట్లు జరిగినా.. అనుమానాలు.. అవమానాలు ఎదురైనా ధైర్యంగా ఉండాలి.
- భార్యాభర్తలు ప్రతిరోజు కొంత సమయం ఒకరికొకరు కేటాయించుకోవాలి.
- బాధ్యతల్లో పడి ప్రేమించే వారిని ఒంటరిగా వదిలేయకూడదు.
- మనస్పర్ధలు వచ్చినా కూర్చుని మాట్లాడుకోవాలి.
- ఏమైనా పొరపాట్లు వచ్చినా అపోహలు తొలిగే ప్రయత్నం రెండువైపులా జరగాలి.
- ఎవరి తప్పు ఉందో తెలుసుకుని సున్నితంగా పరిష్కరించుకోవాలి.
- మరోమారు అలాంటి తప్పు జరగకుండా జాగ్రత్త పడాలి.
- పిల్లల ముందు అస్సలు గొడవ పడరాదు.
- ఎవరైనా మనసును ప్రభావితం చేస్తుంటే సున్నితంగా తిరస్కరించాలి.
- తనకు జీవిత భాగస్వామి, పిల్లలు ఉన్నారని, కుటుంబ బాధ్యత ఉందని గుర్తెరగాలి.



- వివాహేతర సంబంధాలు ఆర్థిక, సామాజిక, శారీరక, మానసిక అనారోగ్య సమస్యలకు దారి తీస్తాయని గమనించాలి.

ఆదర్శమైన ఆ ఐదుగురు దంపతులు...

గుండె గుడిలో లక్ష్మీదేవి నిండిపోయి ఉంటుందని చాటుతూ వక్షస్థలంపై చోటిచ్చిన లక్ష్మీనారాయణుల్లా.. దేహంలో సగభాగం పార్వతీ అంటూ అర్ధనారీశ్వరుడైన గౌరీశంకరుల్లా.. దంపతుల ఇద్దరి మాట ఒకటేనంటూ సతీ సరస్వతిని నాలుకపై నిలిపిన బ్రహ్మదీసరస్వతుల్లా.. జీవకోటిని మేల్కొపుతూ పరుగులు పెట్టే భర్తను అనుసరించే భార్య ఛాయాదేవి, సూర్యుడిలా.. సర్దుకుపోయేతత్వం ఉన్న రోహిణిచంద్రుడిని ఆదర్శంగా తీసుకుని అందంగా, ఆనందంగా తీర్చుదిద్దుకోవాలి. మొత్తం మీద భార్య నుంచి భర్తకు కావాల్సింది ఉపశమనం, సాంత్వన, పోషణ, కాని భార్యకు భర్త నుంచి కావాల్సింది అనుక్షణం సం‘రక్షణ’ ఒక్కటే. పెళ్లినాటి ప్రమాణాలు, నియమాలు, ఒప్పందాలను మర్చిపోకుండా మంచి సమాజం కోసం కుటుంబాన్ని ఆదర్శవంతంగా కొనసాగించినపుడే ఆ దాంపత్యంలో ఆనందం చిరస్థాయిగా ఉంటుంది.

నమ్మకంతో మెలగాలి



దంపతులు ఒకరిపై మరొకరు నమ్మకంతో మెలగాలి. దంపతుల మధ్య దాపరికాలు ఉండకూడదు. సోషల్ మీడియాకు సాధ్యమైనంత దూరంగా ఉంటూ ఒకరితో ఒకరు ఎక్కువ సమయం గడపాలి. వృత్తికి, కుటుంబానికి సమపాళ్లలో సమయం కేటాయించాలి. భార్యాభర్తలు ఇంట్లో ఉన్నప్పుడు వ్యాయామం, భోజనం, అల్పాహారం కలిసి చేయడం ద్వారా ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడుతుంది. పండుగలు, వారంతపు సెలవుల్లో ఒక రోజు తప్పనిసరిగా కుటుంబ సభ్యులకు కేటాయించడం ద్వారా అంతరాలు తొలగిపోయి అనుబంధం బలపడుతుంది.

డాక్టర్ వద్దాది వెంకటకిరణ్, మానసిక వ్యాధి వైద్య నిపుణుడు, జీజీహెచ్, గుంటూరు

ఐదున్నర కిలోల గంజాయి స్వాధీనం

వేటపాలెం:మండల పరిధిలో బచ్చులవారిపాలెంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బచ్చులవారిపాలెంలో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తున్న నాగమ్మ, కంపా కుమార్, దాసరి నవీన్‌లు పట్టుబడ్డారు. నాగమ్మది అదే గ్రామం కాగా కంపా కుమార్ ఈపూరుపాలెం, దాసరి నవీన్ చీరాల రామానగర్‌కి చెందిన వారుగా గుర్తించారు. వీరు చీరాల నుంచి ప్రతి రోజూ బచ్చులవారిపాలెం వచ్చి గంజాయి విక్రయించి తిరిగి వారి గ్రామాలకు వెళుతుంటారు. వీరితోపాటు నాగమ్మ కుమారుడైన మధు ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి వీరికి అందజేస్తున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. మధు పరారీలో ఉన్నాడన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ సమావేశం

బాపట్లఅర్బన్: యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర గుంటూరు ఆధ్వర్యంలో బాపట్ల ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలోని ఓపెన్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్ర గుంటూరు జిల్లా అధికారిణి కిరణ్మయి దేవిరెడ్డి అధ్యక్షత వహించారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువశక్తిని రాజకీయాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ నిర్మాణానికి ఉపయోగిస్తే దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలపవచ్చన్నారు. కిరణ్మయి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ యువత కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్-1 దొప్పలపూడి రామమోహన్‌రావు మాట్లాడుతూ యువత ధైర్యంగా వెల్లడించాలన్నారు. నెహ్రూ యువ కేంద్ర అధికారులు, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు, యువజన సంఘాల సభ్యులు ఇందుకు కృషి చేయాలన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ నవ భారత నిర్మాణానికి యువత సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ గొల్లపూడి శ్రీనివాసరరావు, శ్రావణ్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ ఎస్. శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జీ 20 ప్రెసిడెన్సీకి సంబంధించి వసుధైవ కుటుంబం (ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకటే భవిష్యత్తు అనే నినాదాన్ని గురించి), వై 20 ప్రాముఖ్యత, మిషన్ లైఫ్ ప్రాముఖ్యత, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ 2023 వంటి అంశాలపై విస్తృతంగా జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్లో చర్చించారు. జిల్లా యూత్ పార్లమెంట్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో శ్రీనివాసరావు, కిరణ్మయి, రామోహన్‌రావు, తదితరులు

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 551.30 అడుగుల వద్ద ఉంది. ఇది 212.4290 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,967, ఎడమకాలువకు 9,166, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 4,166, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరదకాలువకు 320 క్యూసెక్కులలు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 25,819 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 25,819 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 824.60 అడుగుల వద్ద ఉంది. ఇది 44.4786 టీఎంసీలకు సమానం.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ మృత్యుఒడికి..

- వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం
- ఒకరు మృతి
- నలుగురికి స్వల్పగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారు టైరు పేలి అదుపుతప్పడంతో ఓ యువకుడు మృతి చెందగా నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని కోనంకి ఇసుక దరిశి గ్రామాల మధ్యగల పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని కుమ్మరిపాలెం కాలనీకి చెందిన షేక్ లతీఫ్ (24), ఎల్లగాల నరేంద్ర, కన్నెబోయిన అవినాష్, సురేష్, గోపి స్నేహితులు. వీరిలో లతీఫ్‌కు గల్ఫ్‌లో ఉద్యోగం రావడంతో రెండు నెలల్లో వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో అవినాష్ తన కాబోయే భార్యతోపాటు తన ముగ్గురు స్నేహితులతో కలిసి తిరుమల దైవ దర్శనానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం శుక్రవారం స్వస్థలానికి తిరుగు ప్రయాణమయ్యారు. నరేంద్ర కారు నడుపుతుండగా జాతీయ రహదారిపై కోనంకి సమీపంలోకి రాగానే కారు ముందు టైరు ఒక్కసారిగా పేలడంతో అదుపుతప్పిన కారు ముందు వెళుతున్న లారీని స్వల్పంగా తాకుతూ వెళ్లి పల్టీ కొట్టింది. ప్రమాద తీవ్రతకు డ్రైవర్ సీటు పక్కన కూర్చొన్న లతీఫ్ తలకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. విషయం తెలిసిన ఎస్ఐ కమలాకర్ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లతీఫ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోస్టుమార్టం అనంతరం లతీఫ్ మృతదేహాన్ని అధికారులు బంధువులకు అప్పగించారు. గల్ఫ్‌లో ఉద్యోగం చేసి తమ కుటుంబాన్ని ఆదుకుంటాడనే ఆనందంలో ఉన్న లతీఫ్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న ఎస్ఐ కమలాకర్



ప్రమాదంలో మృతి చెందిన లతీఫ్